www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | ఆది వారం, 9 అక్టోబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-165 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# మునుగోడు ఉప ఎన్నికపై కెసిఆర్ నజర్

- లెంకలపల్లి ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు
- కేవలం 2085 మంది జనాభాతో కాంగ్రెస్ కంచుకోట

**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో ఆ నియోజకవర్గంలోని లెంకలపల్లి అనే గ్రామానికి పార్టీ ఎన్నికల ఇంచార్జ్‌గా సీఎం కేసీఆర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడిగా ఆయనే ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. కేవలం 2085 మంది జనాభా ఉండే ఈ గ్రామానికి సాక్షాత్తు సీఎం కేసీఆర్ ఎన్నికల ఇంచార్జ్ గా రానుండటం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. స్వరాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ ఇప్పటివరకు ఎన్నో ఉప ఎన్నికలను ఎదుర్కొంది. ట్రబుల్ షూటర్ గా పేరున్న మంత్రి హరీశ్ రావునో లేక మరొకరినో నియోజవర్గ ఇంచార్జులుగా పార్టీ నియమించింది. కానీ స్వయంగా కేసీఆర్ ఇంచార్జ్ గా రావడం... అది కూడా ఓ చిన్న గ్రామానికి కావడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. దీంతో మునుగోడు ఎన్నికను అధికార టీఆర్ఎస్ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో అర్థమవుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక.. మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి అనే ఈ చిన్న గ్రామం 15 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి పెట్టని కోటలా మారింది. అయితే కొన్ని నెలల కిందట స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరడంతో టీఆర్ఎస్ నాయకులు ఈ గ్రామంపై ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలోనే నెల కిందట కాంగ్రెస్ కు చెందిన గ్రామ సర్పంచ్ సతీశ్ 500 మందితో కలిసి కేసీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ లో చేరారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరుల్లో సతీశ్ ముఖ్యమైనవాడు. మునుగోడు ఎన్నికల కోసం టీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులకు మునుగోడు ప్రచార బాధ్యతలు అప్పజెప్పింది పార్టీ అధిష్టానం. ఈ క్రమంలోనే మర్రిగూడ మండలానికి మంత్రి హరీశ్ బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పుడు ఆయన పరిధిలోని ఓ చిన్న గ్రామానికి సీఎం కేసీఆర్ ఎన్నికల ఇంచార్జ్ గా చార్జ్ తీసుకోనున్నారు. ఓ వైపు జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతానంటూ బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన కేసీఆర్... ఇప్పుడు ఓ గ్రామానికి ఎన్నికల ఇంచార్జ్ గా రావడమేంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. కాగా వచ్చే నెల 3న మునుగోడు ఉప ఎన్నిక జరగనుంది.



## సిరిసిల్ల జిల్లా నేత కార్మికుడి అద్భుత ప్రతిభ

### పరిమళాలు వెదజల్లే పట్టు చీరను నేసిన విజయ్

### ఆవిష్కరించి అభినందించిన మంత్రులు కెటిఆర్,హరీష్



**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** మరమగ్గంపై పరిమళాలు వెదజల్లే పట్టుచీరను తయారు చేసి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన నేత కార్మికుడు నల్ల విజయ్ మరోసారి ప్రతిభ చాటు కున్నాడు. ఇప్పటి వరకు అగ్గి పెట్టెలో పట్టే చీర నుంచి మొదలుకుని దబ్బనంలో దూరే చీరలు తయారు చేసిన ఆయన, ఈసారి 27 రకాల సుగంధ ద్రవ్యాలు కలిపి పరిమళాలు వెదజల్లే పట్టుచీరను మరమగ్గంపై నేసి.. అందరి దృష్టిని ఆకర్షించాడు. చేనేత కళాకారుడు 3వ

## మునుగోడు ప్రజల నమ్మకాన్ని అమ్ముకున్న రాజగోపాల్

### కాంట్రాక్టుల కోసమే బిజెపికి అమ్ముడు పోయారు: మంత్రి



**సూర్యాపేట, అక్టోబర్8 (సమ సమాజం):** మునుగోడు ప్రజల నమ్మకాన్ని రాజగోపాల్ రెడ్డి అమ్ముకున్నారని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. కాంట్రాక్టుల కోసమే భాజపాలో చేరారనే విషయం బహిర్గతమైందని వ్యాఖ్యానించారు. డబ్బుల కోసం అమ్ముడుపోయి.. త్యాగాలు చేశాననటం హాస్యాస్పదమన్నారు. ఏ కారణం వల్ల ఉపఎన్నిక వచ్చిందో రాజగోపాల్ చెప్పాలని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. కాంట్రాక్టుల కోసమే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భాజపాలోకి వెళ్లి ఇప్పుడు సవాళ్లు విసురుతుతన్నారని మండిపడ్డారు. డబ్బుల కోసం అమ్ముడుపోయి.. త్యాగాలు చేశాననటం హాస్యాస్పదమన్నారు. ఆర్నెళ్ల క్రితం రూ.18 వేల కోట్ల కాంట్రాక్టులు వచ్చినట్లు నిన్న రాజగోపాల్‌రెడ్డి తెలిపారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఏ కారణం వల్ల ఉపఎన్నిక వచ్చిందో రాజగోపాల్ చెప్పాలని ఆయన 3వ

## తెలంగాణలో వ్యూహకర్త పికె గేమ్ ప్లాన్

### టీఆర్ఎస్, బీజేపీ యుద్ధం చేస్తున్నట్టు నటిస్తున్నాయి

### టిపిసిసి చీఫ్ రేవంత్ ఆరోపణలు



**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ (పీకే) పన్నిన వ్యూహంలో భాగంగానే ప్రజల దృష్టిని మరల్చేందుకు రాష్ట్రంలో టీఆర్ఎస్, బీజేపీ యుద్ధం చేస్తున్నట్టు ప్రయత్నిస్తున్నా యని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్‌ను బలహీన పర్చడం ద్వారా కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో కేసీఆర్ కు లాభం చేకూర్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. టీఆర్ఎస్, బీజేపీ మధ్య అవగాహన ఉందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. మునుగోడులో టీఆర్ఎస్, బీజేపీ మధ్యే ప్రధాన పోటీ అని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఉనికిలో కూడా లేదని అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 8 ఏళ్ల పాలనలో తెలంగాణకు కేసీఆర్ చేసిందేమీ 3వ

## చంద్రుడిపై భారీగా సోడియం నిల్వలు

### చంద్రయాన్-2 లో గుర్తించిన ఇస్రో

**న్యూఢిల్లీ, అక్టోబర్8 (సమ సమాజం):** చంద్రుడిపై భారీగా సోడియం ఉన్నట్లు చంద్రయాన్-2 గుర్తించింది. చంద్రయాన్-2లో ఉన్న క్లాస్ (చంద్రయాన్-2 లార్జ్ ఏరియా సాఫ్ట్ ఎక్స్‌రే స్పెక్ట్రోమీటర్) ద్వారా ఈ సోడియం నిల్వల మ్యాపింగ్ చేసినట్లు భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో తెలిపింది. గతంలో చంద్రయాన్-1లోని ఫ్లూరోసెన్స్ స్పెక్ట్రోమీటర్ (సీ1ఎక్స్ఎస్) తొలిసారిగా చంద్రుడిపై సోడియం ఉన్నట్లు గుర్తించింది. ఇప్పుడు చంద్రయాన్-2 ఈ సోడియం మ్యాపింగ్ చేసినట్లు ఇస్రో ప్రకటించింది. హైసెన్సిటివిటీ, సామర్థ్యం కలిగిన క్లాస్‌ను యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో తయారుచేసినట్లు ఇస్రో తెలిపింది. దీనివల్లనే ఇది సోడియం లైన్స్‌ను వెంటనే గుర్తిస్తుందని పరిశోధకులు చెప్పారు. లూనార్ గ్రెయిన్స్‌తో కలిసి ఉన్న సోడియం కణాలను ఈ క్లాస్ గుర్తించింది. చంద్రుడిపై ఉన్న వాతావరణంలో ఇలా సోడియం లభించడం ఆశ్చర్యకరమని చెప్పారు. ఈ మేరకు 'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమైన కథనంలో ఇస్రో పేర్కొంది. చంద్రుడి ఉపరితలం నుంచి వేల కిలోమీటర్ల వరకు సోడియం జాడలు కనిపించినట్లు ఇస్రో తెలిపింది. చంద్రుడి ఉపరితలం, ఎక్సోస్ఫేర్ సంబంధాన్ని అధ్యయనం చేయడానికి తాజా పరిశోధన ఉపయోగపడుతుందని శాస్త్రవేత్తల భావన.

## తెరాసను భారాస చేయడం వెనుక కుట్ర

### తాంత్రికుడి సలహాలు పూజలతోనే పార్టీ

### నల్లపిల్లితో పూజలు చేయిస్తున్న కెసిఆర్

### ఎన్నికుట్రలు చేసినా మునుగోడు బిజెపిదే

### మీడియా సమావేశంలో బండి సంజయ్ వ్యాఖ్యలు

### మోమన్ భగవత్‌పై కెటిఆర్ వ్యాఖ్యలపై లక్ష్మణ్ ఆగ్రహం



**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** తెరాసను భారాస చేయడం వెనుక కుట్ర ఉందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. ఓ స్వామిజీసూచనల మేరకే తాంత్రిక పూజలు చేసి తాంత్రికుడి సూచనతో కేసీఆర్ పార్టీ మార్చారని వ్యాఖ్యానించారు. మునుగోడులో తెరాస గెలవాలని సీఎం కేసీఆర్ క్షుద్రపూజలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. తెరాస ఎన్ని జిమ్మిక్కులు చేసినా.. మునుగోడులో భాజపా విజయం ఖాయమని అన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను భాజపా ఎంపీ లక్ష్మణ్ ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం సీఎం కేసీఆర్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ 3వ

## తెలంగాణను అప్పలకుప్పగా మార్చారు

### 3 లక్షల కోట్లు అప్పలు చేసిన ఘనత కెసిఆర్‌దే

### బిఆర్ఎస్ జాతీయపార్టీపై నిర్మలాసీతారామన్ విమర్శలు

**న్యూఢిల్లీ, అక్టోబర్8 (సమ సమాజం):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం మధ్య పొలిటికల్ వార్ తీవ్ర రూపం దాలుస్తోంది. దేశ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇస్తూ టీఆర్ఎస్ ను ఇటీవల బీఆర్ఎస్ గా మార్చిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయంతో దేశ రాజకీయాలు చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఏర్పాటుపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఫైర్ 3వ

## కార్పోరేట్లకు వ్యతిరేకం కాదు..



### కేవలం గుత్తాధిపత్యాన్నే వ్యతిరేకిస్తున్నా

### రాజస్థాన్‌లో ఆదానీ పెట్టుబడులపై రాహుల్ స్పందన

**మాండ్యా, అక్టోబర్8 (సమ సమాజం):** దాను కార్పోరేట్లకు వ్యతిరేకం కాదని, కేవలం గుత్తాధిపత్యాన్నే వ్యతిరేకి స్తున్నానని రాజస్థాన్‌లో ఆదానీ పెట్టుబడులపై రాహుల్ స్పందించారు. బిజెపి కొందరికే కేటాయింపులు చేయడాన్ని ఇప్పటికీ వ్యతిరేకిస్తానని అన్నారు. అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ ప్రశంసించడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. తాను కార్పొరేట్లకు వ్యతిరేకం కాదని, కేవలం గుత్తాధిపత్యానికి మాత్రమే వ్యతిరేకమని చెప్పారు. అదానీ రాజస్థాన్‌లో రూ.60,000 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని, దీనిని తిరస్కరించడం ఏ ముఖ్యమంత్రికైనా తగినది కాదని చెప్పారు. రాహుల్ 3వ

## మునుగోడు ప్రచారానికి మంత్రి



**ఖమ్మం, అక్టోబర్8 (సమ సమాజం):** వచ్చేనెల 3న జరగనున్న మునుగోడు ఉప ఎన్నిక ప్రచారానికి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన వెళ్లనున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మునుగోడు నియోజకవర్గంలోని కొరటికల్, దుబ్బకాల్వ గ్రామాలకు మంత్రి పువ్వాడ, కొంపల్లి, కల్వకుంట్ల గ్రామాలకు తాతా మధుసూదన ఇనఛార్జ్‌లుగా నియమితులయ్యారు. ఆ మేరకు మంత్రి, ఎమ్మెల్సీ తమకు కేటాయించిన గ్రామాల్లో తమ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రచారం చేస్తారు.

## రాజగోపాల్ పేరును అధికారికంగా ప్రకటించిన బిజెపి



**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** మునుగోడు ఉపఎన్నిక అభ్యర్థిని బీజేపీ ఖరారు చేసింది. మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని అభ్యర్థిగా బీజేపీ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజగోపాల్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ వేసే సమయంలో పార్టీ, రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ తరుణ్ చుగ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరుకానున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజీనామాతో మునుగోడులో ఉపఎన్నిక జరుగుతున్న విషయం తెలిసిందే. నవంబర్ 3న ఉపఎన్నిక జరగనుంది. ఉపఎన్నిక కౌంటింగ్ నవంబర్ 6న జరగనుంది. రాజగోపాల్ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉప ఎన్నికకోసమే ఆయన రాజీనామా చేశారు.

## సంపాదకీయం

# దేశంలో మారుతున్న సమీకరణాలు !

దేశంలో వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2024 సార్వత్రిక ఎన్నికలు అన్ని రాజకీయ పార్టీలకు అత్యంత కీలకమైనవిగా భావించాలి. అన్ని పార్టీలు వచ్చే ఎన్నికలు లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. జాయిా రాజకీయాల కోసం టిఆర్ఎస్‌ను బిఆర్ఎస్‌గా మార్చిన కెసిఆర్ లక్ష్యం కూడా వచ్చే ఎన్నికలే అని ప్రకటించారు. ఇక కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో దేశంలో ప్రజాభిమానం సంపాదించుకునే యత్నాల్లో ఉన్నారు. మొత్తంగా మరో ఏడాదిన్నరకు ముందే దేశంలో రాజకీయ వేడి అందుకుంది. ప్రధాని మోడీకూడా ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తూ ఎన్నికల వేడిని రగిలిస్తున్నారు. గుజరాత్‌లో మోదీ గత ఆరు నెలలుగా సుడిగాలి పర్యటనలు చేస్తూ వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. హిమాచల్‌లో గత వారం మండీలో బిజెపి యువమోర్చా నిర్వహించిన విజయ్ సంకల్ప్ ర్యాలీలో మోదీ పాల్గొన్నారు. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లలో భారతీయ జనతా పార్టీ విజయానికి ఢోకా లేదని భావించినా.. వాటిని సులువుగా తీసుకోవడం లేదు. గెలవడానికి అవసరమైన అన్ని ఎత్తులు వేస్తున్నారు. అయినప్పటికీ ఏ ఎన్నికనూ మోదీ యథాలాపంగా తీసుకునేలా లేరు. అందుకే ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. హిమాచల్‌లో ఎయిమ్స్‌ను ప్రారంభించారు. ఇకపోతే భారత్ జోడో యాత్ర ద్వారా తన రాజకీయ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలనుకుంటున్న రాహుల్ గాంధీ దేశంలో ప్రజలను నేరుగా కలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. బిజెపితో తెగతెంపులు చేసుకుని రాష్ట్రీయ జనతాదళ్‌తో చేతులు కలిపిన నితీశ్ కుమార్ కాంగ్రెస్‌తో కలిసి మోడీకి వ్యతిరేకంగా కేటమి కోసం యత్నాలు చేస్తున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో తిరిగి ప్రాభవం సాధించేందుకు సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ప్రయత్నాలు చేస్తున్నారు. మహారాష్ట్రలో బాల్ ఠాక్రే వారసత్వాన్ని నిలబెట్టుకోవాలని ఆశిస్తున్న శివసేన అధినేత ఉద్దవ్ ఠాక్రే కూడా తిరిగి శివసేనను బలోపేతం చేసే పనిలో ఉన్నారు.గుజరాత్, హిమాచల్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందే అయిదు రాష్ట్రాల్లో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఉప ఎన్నికలకు విశేష రాజకీయ ప్రాధాన్యమున్నది. ఇందులో తెలంగాణ లోని మునుగోడు ఉప ఎన్నిక బిజెపితో పాటు, టిఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. మొత్తంగా చూస్తే తాజా రాజకీయ పరిణామాలు భారత రాజకీయాల్లో కీలక మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలియచేస్తున్నాయి. మోడీకి కూడా అంత ఈజీ కాదని గుర్తించాల్సిన సమయమిది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించి త్వరలో జరగబోయే ఉప ఎన్నికలు, ఆ తర్వాత ఈ నవంబర్, డిసెంబర్ లలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు అంత సులువు కాదు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు కూడా బలంగానే దూసుకుని వస్తున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజయపరంపరకు ఇప్పటివరకు అడ్డు లేకుండా పోయింది. అయితే అది ఎల్లవేళలా ఒకేలా ఉంటుందనుకోవడానికి లేదు. రానున్న ఎన్నికల్లో కూడా ఇదే విజయఢంకా మోగుఉతందనడానికి లేదు. ప్రలజు ఎప్పుడు ఎలా ఆలోచిస్తారో చెప్పలేం. ఎందుకంటే గ్యాస్ ధరలు, పెరిగిన నిత్యావసరాల ధరలు,జిఎస్టీ మోత వంటివి ప్రత్యక్షంగా అనుభవిస్తున్న ప్రజలకు ఎన్నికలు ఓ అవకాశంగా కనిపిస్తుంది. ఉప ఎన్నికలతో పాటు గుజరాత్, హిమాచల్ రాష్ట్రాల్లో గెలిచినప్పటికీ అసలు యుద్ధం 2023లో జరిగే కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, త్రిపుర, తెలంగాణ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల రూపంలో జరగనుంది. ఈ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం 2024 సార్వత్రిక ఎన్నికలు, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై పడే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతానికి మోడీ ప్రజలనుంచి వస్తున్న వ్యతిరేకతను పెద్దగా పట్టించుకోవడం లేదు. బిజెపిఎదుర్కొంటున్న విమర్శలు మోదీ,అమిత్ షాలకు తెలియనివి కాదు. పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, అధికమవుతున్న ఆర్థిక అసమానతలు, యువతలో అశాంతి గురించి ప్రతిపక్షాలు ఎంతగా విమర్శలు చేస్తున్నా కొట్టి పారేస్తున్నారు. దేశంలో పేదరికం అంతకంతకూ పెరుగుతోంది. 20 కోట్ల మంది పేదలు ఇంకా దారిద్యరేఖ దిగువన ఉన్నట్లుగగా సర్వేలు చెబుతున్నాయి. దేశంలో 5కోట్ల మంది దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నారని, ఆహారం కొరత ఉందన్న ప్రపంచ సంస్థల నివేదికలు కూడా ఆందోళన కలిగి స్తున్నాయి. దేశ జనాభాలో కేవలం ఒక శాతం మంది మాత్రమే 20 శాతం జాతీయ సంపదను అనుభవిస్తు న్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ అసమానతల గురించి మోడీ ఏనాడూ ఆలోచించడం లేదు. మోదీ పట్ల గత ఎనిమిది సంవత్సరాలకు పైగా ఆదరణ చూపిస్తున్న ప్రజలు ఇప్పుడు ఇవన్నీ ఆలోచన చేస్తున్నారు. మోడీ మాయాజాలంతో ఇంకా మోస పోవడానికి వీరు సిద్దంగా లేరు. రోజురోజుకూ పెరుగు తున్న డాలర్ ధరతో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం, దిగుమతులు ఎగుమతుల కంటే వేగంగా పెరగడంతో మన వర్తకపు లోటు కూడా పెరగడం, విదేశీ మదుపరిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం కూడా తీవ్రంగా ఆందోళనకరమైన విషయాలే. ప్రజల దైనందిన జీవితాలపై తీవ్ర ప్రభావం చూపే ఈ అంశాలు బిజెపికి రాజకీయంగా పెద్ద దెబ్బ కానున్నాయి. ఇప్పటివరకూ మోదీకి బలమైన ప్రతిఘటన ఇవ్వలేకపోయిన ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి. ఇటీవలి రాజకీయ పరిణామాలు విపక్షాలను ఏకం చేసేవిగా కనిపిస్తున్నాయి. కనుక మార్పులు అనివార్యం కావచ్చు. కాబట్టి మోడీ తేరుకుని ప్రజల సంక్షేమం లక్ష్యంగా నిర్ణయాలు తీసుకోకుంటే ప్రజలు నమ్మరు. మోడీని ఇంకా ఎందుకు నమ్మాలన్న ఆలోచన కూడా చేస్తారు.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# అన్నదాతలను కుదేలు చేస్తున్న అకాల వర్షాలు

### పంటచేతికొచ్చే సమయంలో మళ్లీ నష్టాల భయాలు



**హైదరాబాద్/విజయవాడ, అక్టోబర్8 (సమ సమాజం):** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలు అన్నదాతను కుదేలు చేస్తున్నాయి. సామాన్యలకు కంటినిండా కునుకు కాదుకదా..ఇళ్లల్లో ఉండలేని దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయి.అకాల వర్షాలు అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేజారి పోతున్నాయంటూ ఆవేదనకు గురవుతున్నారు. మును పెన్నడూ లేనివిధంగా ఈ యేడు అధిక వర్షాలు కురవ డంతో పంటలు ఆశాజనకంగానే కనిపిస్తున్నా.. చేతికి వచ్చిన సమయంలో కురుస్తున్న వర్షాలు దిగుబడులపై ప్రభావాన్ని చూపుతున్నాయి. వాతావరణ ప్రకటనలు అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పటికే పంట కొనుగోళ్లు ప్రారంభం కావాల్సి ఉండగా.. జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలకు అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. ఉత్తర తెలంగాణతో పాటు, దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ జోరు వానలు కురుస్తున్నాయి. అలాగే ఉభయగోదావరి,గుంటూరు,ప్రకాశం, కృష్ణా జిల్లాల్లోనూ వర్షాలు దెబ్బతీస్తున్నాయి. వర్షాలకు చేతికి వచ్చిన పంటలను అమ్ముకునే పరిస్థితి లేక రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. ఇప్పటికే నైరుతి రుతుపవనాలు తిరుగుముఖం పట్టాయని వాతా వరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నా.. కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవాలన్నా.. రైతులు అవస్థలే పడాల్సి వస్తుంది. పంటను పండించడం ఒక ఎత్తైతే, చేతికి వచ్చిన పంటలను అమ్ముకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతు న్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంటలను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, ఖాళీ స్థలాల్లో పంటలను ఆర బెడుతూ.. రాత్రీ, పగలు అనే తేడా లేకుండానే పంట కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. అయితే గత రెండు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పత్తి,సోయా పంట తడవడంతో నాణ్యత దెబ్బతింటోందని అన్నదాతలు వాపోతున్నారు. అంతేకాకుండా.. పగలంతా పంటలను ఆరబెట్టడం, రాత్రి వేళల్లో కవర్లను కప్పి పంటలను కాపాడుకోవడం రైతులను కునుకు లేకుండా చేస్తోంది. పనిగా మారింది. ఇప్పుడిప్పుడే పంట కోతలు ఊపందుకుంటున్న సమయంలో కురుస్తున్న వర్షానికి ఆటంకంగా మారింది. వెంటాడుతున్న వర్షాలతో పంటల కోత, నూర్పిడి, పత్తి ఏరేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా నల్లరేగడి నేలల్లో సాగు పనులు ముందుకు సాగే అవకాశం కనిపించడం లేదు.తడిసిన పంటను వ్యాపారులు కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పంట నాణ్యతగా లేదంటూ దళారులు కొర్రీలు పెడుతూ.. అందినకాడికి దండు కుంటున్నారు. జిల్లాలో సోయా పంటను కొనుగోలు చేస్తున్న దళారులంతా కుమ్మకై ధరను తగ్గిస్తున్నారు. ఇకపోతే సార్వాలో ధాన్యం మాసూళ్లు ప్రారంభం అయ్యాయి. అయినప్పటికి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల జాడ కానరావడం లేదు. మెట్ట ప్రాంతంలో బోరు బావుల సహాయంతో పండించిన పంట ఇప్పటికే కోత దశకు వచ్చింది. అక్కడక్కడా వరి పంటను రైతులు మాసూళ్ళు చేసి ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. రైతుల వద్ద నుంచి దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించకపోవడం, ఇప్పటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులనే ఆశ్రయించాల్సి వస్తుంది. పండిన పంట నిల్వ చేసుకునే సామర్థ్యం, సౌకర్యాలు లేక దళారులు అడిగిన ధరలకు ధాన్యం విక్రయించుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

# జిల్లాలో పట్టు కోసం బిజెపి కసరత్తు

### నియోజకవర్గ స్థాయిలో ఇన్‌ఛార్జీల నియామకం

**ఖమ్మం, అక్టోబర్8 (సమ సమాజం):** రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై భారతీయ జనతాపార్టీ దృష్టిపెట్టింది. అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో ఇనచార్జ్‌లను నియమించి క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి శ్రీకారంచుట్టింది. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఇనచార్జ్‌లను నియమించారు. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాలకు రాష్ట్రంలోని పలువురు ముఖ్యనేతలను ఇనచార్జ్‌లుగా నియమించారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాలకు చెందిన పార్టీ ప్రముఖులను, ఎంపీలను, మాజీమంత్రులను, మాజీ ఎంపీలను జిల్లాలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిశీలకులుగా పంపించి క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని బీజేపీ అంచనా వేసింది. గతంలో కూడా పరిశీలకులుగా వచ్చిన వారిని త్వరలో పూర్తిస్థాయి మరో అదనపు ఇనచార్జ్‌లుగా నియమించబోతున్నారు. ప్రస్తుతం ఇనచార్జ్‌లుగా నియమితులైన వారిలో పినపాక నియోజకవర్గానికి రాచకొండయ్య కొమరయ్య, ఇల్లెందుకు రాజవర్ధనరెడ్డి, ఖమ్మానికి కడగంచి రమేష్, పాలేరుకు నూకల వెంకటనారాయణరెడ్డి, మధిరకు ఎడ్ల అశోక్‌రెడ్డి, వైరాకు సరికొండ విద్యాసాగర్‌రెడ్డి, సత్తుపల్లికి కనగాల వెంకటరామయ్య, కొత్తగూడేనికి ఎ.రాకేష్రెడ్డి, అశ్వారావుపేటకు అజ్మీర కృష్ణవేణినాయక్, భద్రాచలానికి రాణాప్రతాప్‌రెడ్డిలను నియమించినట్లు బీజేపీ నేతలు తెలిపారు. కాగా పార్లమెంట్ నియోజకవర్గస్థాయిలో పరిశీలకులుగా ఖమ్మం,మహబూబాబాద్‌కు కేంద్రమంత్రులను బీజేపీ జాతీయ నాయకత్వం నియమించింది. కేంద్రమంత్రులు కూడా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిపై అధిష్ఠానానికి నివేదికలు అందించారు. ప్రస్తుతం నియమించిన ఇనచార్జ్‌లు అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి తెలియచేయడం, పార్టీని బలోపేతం చేయడం, ఇతర పార్టీలకు చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానించడం, కార్యకర్తలకు బూతస్థాయినుంచి శిక్షణ తరగతులు, తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. మొత్తంమీద నియోజకవర్గ ఇనచార్జ్‌ల నియామకం ద్వారా రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ క్షేత్రస్థాయిలో కార్యాచరణను వేగవంతం చేసినట్టు నేతలు చెబుతున్నారు.

# మునుగోడులో టిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** మునుగోడు నియోజకవర్గంలో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మునుగోడు నియోజకవర్గ ఉపఎన్నిక నేపథ్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని రత్న నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాలకు ఎమ్మెల్యేను పార్టీ అధిష్టానం ఇన్‌చార్జిగా నియమించింది. దీంతో ఆయన శనివారం చౌటప్పల్‌లో పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశమై పార్టీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడప గడపకు వివరించాలని సూచించారు. టీఆర్ఎస్ అభ్యర్థి విజయం సాధిస్తే మునుగోడు నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలను చైతన్య పరచాలని కోరారు . కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ ÷ఖా(ఃఖా) నాయకులు నర్సిరెడ్డి, దామోదర్ రెడ్డి, మల్లేశం, కిరణ్, శశిధర్ రెడ్డి, అమర్, రాంరెడ్డి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఓరుగంటి వెంకటేశ్, మాన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ పలు డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్ గౌడ్, సత్యంచారి, లింగాల రాహుల్ గౌడ్ ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## అవసరాల మేరకు ఇంధన కొనుగోళ్లు: కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ, అక్టోబర్8 (సమ సమాజం):** ఏ దేశం నుంచైనా ఇంధనాన్ని కొనుగోలు చేయడానికి భారత్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని కేంద్ర పెట్రోలియం శాఖ హర్దీప్ సింగ్ పురి తెలిపారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనవద్దు అని ఏ దేశం కూడా తమకు చెప్పలేదని మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో ఉన్న జనాభా దృష్ట్యా, ఇక్కడ ఉన్న వినియోగం దృష్ట్యా .. అవసరాల మేరకు ఇంధనకొనుగోళ్లు తప్పవన్నారు. ఈ నేపథ్యంలో ఎవరి నుంచైనా ఇంధనాన్ని కొంటామని ఆయన అన్నారు. మన విధానాల పట్ల స్పష్టమైన అవగాహన ఉండాలని, ఇంధన భద్రత, ఇంధనం ఖరీదు చేసే స్థోమత విషయాలను ఆలోచిస్తే, అప్పుడు ఎక్కడి నుంచైనా ఇందనం కొంటామని మంత్రి పురి తెలిపారు.

## డిసెంబర్‌కల్లా గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్

### ట్వీట్ చేసిన మంత్రి కెటిఆర్



**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** దండుమల్కాపురంలోని ఎంఎస్‌ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో అతి విశాలమైన, అన్ని వసతులు ఉన్న నైపుణ్య శిక్షణా కేంద్రం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డిసెంబర్ సరికల్లా అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ విషయాన్ని తెలపడానికి సంతోషిస్తున్నానని పేర్కొన్నారు. ఇండస్ట్రియల్ పార్కులు నెలకొల్పి, వాటిల్లో స్కిల్ డెవపల్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూ, వారికి ఉపాధి అవకాశాలు పెంచడమే టీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని కేటీఆర్ ప్రకటించారు. 547 ఎకరాల్లో విస్తరించి, 589 ఎంఎస్‌ఎంఈ యూనిట్ల స్థాపనకు వీలుగా ఏర్పాటు చేసిన దండుమల్కాపురం ఎంఎస్‌ఎంఈ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ద్వారా ప్రత్యక్షంగా 20 వేల మందికి, పరోక్షంగా 16 వేల మందికి ఉపాధి లభిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.

## డిజిపి ఎదుట లొంగిపోయిన మావోయిస్ట్ పోచక్క

**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** తెలంగాణ పోలీసుల ఎదుట మావోయిస్టు ఉషారాణి లొంగిపోయారు. ఆమెను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన సందర్భంగా డీజీపీ మహేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. దండకారణ్యం డివిజనల్ కమిటీ సెక్రటరీగా ఉషారాణి అలియాస్ పోచక్క పని చేస్తున్నట్లు తెలిపారు. ఉషారాణి అనారోగ్య కారణాలతో లొంగిపోయినట్లు పేర్కొన్నారు. ఏపీకి చెందిన ఉషకు కొన్నేండ్ల పాటు దండకారణ్య దళంలో కీలక బాధ్యతలు అప్పగించారు. మావోయిస్టు ఉషారాణి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి. ఆమె మద్రాస్ యూనివర్సిటీలో ఎంఏ చదివారు. 1980లో మావోయిస్టు పార్టీలో చేరారు. దాదాపు 40 ఏండ్ల పాటు ఆమె వివిధ హోదాల్లో మావోయిస్టు పార్టీలో పని చేశారు.

# దీపావళిపై మరోమారు సందిగ్ధత

### 25న అమావాస్య పూర్తిగా లేదన్న భావన

### అదేరోజు పాక్షక సూర్యగ్రహం ఉందంటున్న పండితులు



**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** ఈ యేడు మరోమారు దీపావళి ఎప్పుడన్న దానిపై మళ్లీ తర్జనభర్జనలు మొదలయ్యాయి. అమావాస్య ఘడియల నేపథ్యంలో ఈ సందిగ్ధం వచ్చిపడింది. ఈ నెల 25న అమావాస్య ఉంది కనుక అదేరోజు దీపావళి అంటున్నారు. అయితే.. 25వ తేదీ సాయంత్రం 4.19 గంటలకు అమావాస్య వెళ్లిపోయి పాడ్యమి వస్తుంది. ఆరోజు రాత్రిపూట అమావాస్య ఘడియలు ఉండవు. 24వ తేదీ ఉదయాన్నే చతుర్దశి తిథి ఉంటుందని.. సాయంత్రం వచ్చిన అమావాస్య తిథి ఆ రాత్రంతా ఉంటుంది కాబట్టి.. ఉదయాన్నే అభ్యంగన స్నానం, సాయంత్రం లక్ష్మి పూజ నిర్వహించుకోవడం, పటాసులు కాల్చడం ద్వారా అదే రోజు దీపావళి చేసుకోవచ్చని పండితులు చెబుతున్నారు. ఇకపోతే దేశ ప్రజలంతా పెద్ద ఎత్తున జరుపుకొనే దీపావళి నాడు అక్టోబరు 25న పాక్షిక సూర్యగ్రహణం.. ఉంటుందని అంటున్నారు.పూజలు చేసే కార్తీక పౌర్ణమినాడు చందగ్రహణం ఏర్పడుతున్నాయి. 25వ తేదీన సాయంత్రం 5.11 గంటల నుంచి 6.27 గంటల వరకూ సూర్యగ్రహణం ఏర్పడుతుందని జ్యోతిష పండితులు తెలిపారు. ఆరోజేనే ప్రభుత్వాలు దీపావళి సెలవు దినంగా ప్రకటించాయి. ఇక, కార్తీక పౌర్ణమినాడు నవంబరు 8న మధ్యాహ్నం 2.39 నుంచి సాయంత్రం 6.27 గంటల వరకు చంద్ర గ్రహణం ఏర్పడనుంది. సూర్యాస్తమయం అయ్యాక కొద్ది సేపటి వరకే గ్రహణం ఉంటుది కాబట్టి తెలుగు రాష్ట్రాల్లో చందగ్రహణం చివరి ఘడియల్లో మాత్రమే కనిపించే అవకాశం ఉందని పండితులు చెబుతున్నారు. అయితే.. నవంబరు 7 సాయంత్రం నుంచే పౌర్ణమి ప్రారంభం అవుతుంది కాబట్టి 8న చందగ్రహణం ఉన్నందున కార్తీక వ్రతాలేవైనా ఉంటే 7వ తేదీన జరుపుకోవచ్చని వారు సూచిస్తున్నారు.

# ఎబివిపి విద్యార్థిగా వచ్చినప్పుడు లాఠీ దెబ్బలు

### అసోం పర్యటనలో గతాన్ని గుర్తు చేస్తున్న అమిత్ షా

### బిజెపి కార్యకర్తల సమావేశంలో మంత్రి వెల్లడి

**గౌహతి, అక్టోబర్8 (సమ సమాజం):** తాను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నేతగా అస్సాంకు గతంలో వచ్చానని, అయితే అప్పటి ముఖ్యమంత్రి హితేశ్వర్ సైకియా పరిషత్ విద్యార్థులపై లాఠీలతో దాడిచేయించారని ,తమను తీవ్రంగా కొట్టారని కేంద్ర హోం మంత్రి, బీజేపీ సీనియర్ నేత అమిత్ షా చెప్పారు. తన రాజకీయ జీవితంలో తొలినాళ్ళను శనివారం గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని అప్పట్లో ఎవరూ ఊహించలేదని పేర్కొన్నారు. అమిత్ షా శనివారం గువాహటిలో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అస్సాంలో హితేశ్వర్ సైకియా ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిరసన కార్యక్రమాలను నిర్వహించినప్పటి విషయాలను గుర్తు చేసుకున్నారు. నేను విద్యార్థి పరిషత్ కార్యక్రమం కోసం ఇక్కడికి వచ్చాను. మమ్మల్ని హితేశ్వర్ సైకియా తీవ్రంగా కొట్టారు. అస్సాం కీ గలియాన్ సూనీ హై, ఇందిరా గాంధీ ఖూనీ హై వంటి నినాదాలు చేసేవాళ్ళం. బీజేపీ అస్సాంలో సొంతంగా రెండుసార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలదని అప్పట్లో ఎవరూ ఊహించలేదని అమిత్ షా చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంలో అస్సాం, ఈశాన్య రాష్ట్రాలు గత ఎనిమిదేళ్ళ నుంచి శాంతి, అభివృద్ధి బాటలో దూసుకెళ్తున్నాయన్నారు. డెబ్బై ఏళ్ళ కాంగ్రెస్ పాలన ఈ ప్రాంతాన్ని హింస, అరాచకంలోకి నెట్టిందని, మోదీ నాయకత్వం ఈ ప్రాంతానికి శాంతిని తీసుకొచ్చిందని, ఈ ప్రాంతం ప్రధాన జీవన స్రవంతిలో చేరడానికి దోహదపడిందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో ఈశాన్య రాష్ట్రాల్లో భారత దేశాన్ని ముక్కలు చేసే పక్రియ జరిగిందని, దానిని కాంగ్రెస్ మౌనంగా చూసిందని చెప్పారు. 'భారత్ జోడో'ను కోరుకునేవారికి ఈశాన్య భారత దేశంలో ఏర్పడిన శాంతి, జరుగుతున్న అభివృద్ధి ఓ ఉదాహరణ అని తెలిపారు. కనీసం ఒక ఉపన్యాసమైనా ఇవ్వకుండా దేశాన్ని ఏ విధంగా సమైక్యంగా ఉంచగలమనేదానికి ఉదాహరణ అని చెప్పారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కలిసి ఆ పార్టీ నూతన ప్రధాన కార్యాలయాన్ని అమిత్ షా ప్రారంభించారు. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, బీజేపీ అస్సాం శాఖ అధ్యక్షుడు భాబేష్ కలిత, త్రిపుర ముఖ్యమంత్రి మానిక్ సాహా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అభిషేకం టిక్కెట్ ధరలపై దుమారం

### కాణిపాకం ఇవోపై బదిలీవేటు

**చిత్తూరు, అక్టోబర్8 (సమ సమాజం):** అభిషేకం టికెట్ ధరను భారీగా పెంచి వివాదానికి తెరలేపిన కాణిపాకం ఆలయ ఇఒ సురేష్‌బాబుపై బదిలీ వేటు పడింది. ఆయన స్థానంలో నూతన ఇఒగా కర్నూలులో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనరుగా పనిచేస్తున్న రాణా ప్రతాప్‌ను ఇన్‌ఛార్జి ఇఒగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు దేవాదాయశాఖ కమిషనరు హరి జవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కాణిపాకం ఆలయానికి ఎఫ్ఎసిగా విధులు నిర్వహిస్తున్న రాజమండ్రి రీజనల్ జాయింట్ కమిషనరు ఎంవి సురేష్‌బాబును ఎఫ్ఎసి బాధ్యతల నుంచి తొలగించారు. రెండు రోజుల క్రితం కాణిపాకం ఆలయంలో అభిషేకం టికెట్ ధరను రూ.700 నుంచి రూ.5 వేలకు పెంచుతూ నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో యాత్రికుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ ఇఒను అక్కడ నుంచి తప్పించారు. దీనిపై బిజెపి తీవ్రంగా స్పందించి టిక్కెట్ ధరలను పెంచడంపై మండిపడింది. ఎవరిని సంప్రదించి టిక్కెట్ రేట్లు పెంచారని బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు తీవ్రంగా మండిపడ్డారు.

# దేశాన్ని నాశనంచేస్తున్న మోడీ ద్వయం



○ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసుకుంటున్నారు
○హైదరాబాద్‌లో కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి ఖర్గే
○స్థానిక నేతలతోభేటీ..గెలుపు కోసం అభ్యర్థన

**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** ప్రధాని మోడీ, అమిత్ షా కలిసి దేశాన్ని నాశనం చేస్తున్నారని ఏఐసీసీ అధ్యక్ష అభ్యర్థి మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 70 ఏళ్లలో కాంగ్రెస్ దేశానికి ఎంతో చేసిందని, వాటిని మోడీ అమ్మేస్తున్నారని విమర్శించారు. పార్టీ అంతర్గత నియమాల ప్రకారం అధ్యక్ష ఎన్నికలు జరుగు తున్నాయని చెప్పారు. జైపూర్ చింతన్ శిబిర్ లో తీసుకున్న నిర్ణయాల అమలుకు కృషి చేస్తానన్నారు. అంతకుముందు బేగంపేట విమానాశ్రయంలో ఖర్గేకు హస్తం నేతలు ఘనస్వాగతం చెప్పారు. అధ్యక్ష ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌కు వచ్చిన ఖర్గే.. గాంధీభవన్ లో కాంగ్రెస్ నేతలతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికకు అక్టోబర్ 17న పోలింగ్ జరగనుంది. ఇప్పటికే మల్లికార్జున ఖర్గే, శశిథరూర్ నామినేషన్లు దాఖలు చేశారు. అక్టోబర్ 19న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజున ఫలితాలను వెల్లడించనున్నారు. 9 వేల మందికి పైగా కాంగ్రెస్ డెలిగెట్స్ ఓటు వేయనున్నారు. కాగా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి చివరిసారిగా నవంబర్, 2000లో ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో సోనియాగాంధీ చేతిలో జితేంద్ర ప్రసాద ఓడిపోయారు. అంతకుముందు 1997లో శరద్ పవార్, రాజేష్ పైలట్‌లను సీతారాం కేసరి ఓడించారు. అంతకుముందు ఏఐసీసీ అధ్యక్ష అభ్యర్థి కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే బేగంపేట్ ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. టీపీసీసీ నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈనెల 18న జరిగే ఏఐసీసీ అధ్యక్ష్య ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని టీపీసీసీ డెలిగెట్స్‌ను ఖర్గే కోరారు. 2002 తర్వాత మళ్ళీ అధ్యక్ష్య ఎన్నికలకు ఓటింగ్ జరుగుతుండడంతో టీపీసీసీ డెలిగెట్స్‌కు ప్రాధాన్యత పెరిగింది. ఈ క్రమంలో శనివారం గాంధీభవన్‌లో పీసీసీ ప్రతినిధులతో ఆయన సమావేశం అయ్యారు. ఏఐసీసీ అధ్యక్ష్య పదవి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని రాష్ట్ర నేతలను ఖర్గే కోరారు. మొత్తంగా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల సందడి రాష్ట్రంలో మొదలైంది. ఏఐసీసీ అధ్యక్ష స్థానం కోసం పోటీ చేస్తున్న పార్టీ సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్గే హైదరాబాద్‌కు చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఖర్గేకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. గాంధీభవన్‌లో పీసీసీ ప్రతినిధులతో ఆయన సమావేశం అయ్యారు. ఏఐసీసీ అధ్యక్ష పదవి ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని రాష్ట్ర నేతలను ఖర్గే కోరారు. తెలంగాణలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇద్దరు చొప్పున 238 మంది ప్రతినిధులు ఏఐసీసీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 8 వరకు సమయం ఉంది. ఆ తర్వాత బరిలో ఉండేది ఎవరో తేలిపోనుంది. అక్టోబర్ 8న సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లను వెల్లడించనున్నారు. థరూర్, ఖర్గేలలో ఎవరు నామినేషన్లు ఉపసంహరించుకోకపోతే అక్టోబర్ 17న ఎన్నికలు నిర్వహిస్తారు. 9వేలకు పైగా ఉన్న కాంగ్రెస్ సభ్యులు ఎన్నికల్లో ఓటేస్తారు. అక్టోబర్ 19న కౌంటింగ్ ఉంటుంది. అదేరోజు విజేతను ప్రకటిస్తారు. మరోవైపు, మిస్త్రీ ప్రకటన తర్వాత ట్వీట్ చేసిన థరూర్.. స్నేహపూర్వక పోటీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యయుత ప్రక్రియ పార్టీకి, నేతలకు ప్రయోజనం కలిగిస్తుందని అన్నారు.

# పేరు మార్చుకున్నంత మాత్రాన జాతీయ పార్టీ అవుతుందా

○బిజెపి చరిత్రలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నిక జరగలేదు
○కాంగ్రెస్ అధ్యే ఎన్నికల్లో మద్దతు కోరిన మల్లి కార్జున ఖర్గే

**హైదరాబాద్, అక్టోబర్8 (సమ సమాజం):** పేరు మార్చుకున్నంత మాత్రాన తెరాస జాతీయ పార్టీ అయిపోదని ఏఐసీసీ అధ్యక్ష అభ్యర్థి మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. గతంలో చాలా ప్రాంతీయ పార్టీలు పేరు మార్చుకున్నా.. జాతీయ పార్టీలు కాలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఆయన.. మద్దతు కోసం రాష్ట్రానికి వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో నేతల మధ్యే ఈ ఎన్నిక జరుగుతుందన్న ఖర్గే.. భాజపా చరిత్రలో ఇలాంటి ఎన్నిక జరగలేదన్నారు. ప్రాంతీయ పార్టీలు పేరు మార్చుకున్నంత మాత్రాన జాతీయ పార్టీలు అయిపోవని మల్లికార్జునఖర్గే పేర్కొన్నారు. తెరాస జాతీయ పార్టీగా మారుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఈ మేరకు ఆయన వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా గాంధీభవన్‌లో పీసీసీ ప్రతినిధులతో ఖర్గే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని ఖర్గే ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా తమ పార్టీలో ఎన్నిక జరుగుతుందని.. భాజపా చరిత్రలో ఇలాంటి ఎన్నిక ఎప్పుడూ జరగలేదన్నారు. మోదీ, అమిత్‌షా దేశాన్ని నాశనం చేస్తున్నారని ఖర్గే విమర్శించారు. తొమ్మిది వేలకు పైగా ఉన్న ఓటర్లను తాను నేరుగా కలిసి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పర్యటించి, కాంగ్రెస్ ఓటర్లను అభ్యర్థించానని పేర్కొన్న ఖర్గే.. 138 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్?లో నాలుగు పర్యాయాలు ఎన్నికలు జరిగాయన్నారు. ఇప్పుడు ఐదోసారి.. తాను బరిలో దిగానని తెలిపారు. ఈ క్రమంలోనే ఉదయ్?పూర్ చింతన్ బైటక్?లో తీసుకున్న డిక్లరేషన్?ను అమలు చేస్తానన్న ఖర్గే.. రైతులు, యువత, మహిళలు, అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తామన్నారు. శశిథరూర్ కూడా ఇక్కడికి వచ్చి ప్రచారం చేసుకోవచ్చన్నారు. ఇందులో ఎలాంటి వ్యత్యాసం ఉండదని స్పష్టం చేశారు. మోదీ, అమిత్‌షా కలిసి దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారు. 60 ఏళ్లలో ఏం చేశారంటున్నారు. మేము దేశాన్ని ధాన్య భాండాగారంగా తీర్చిదిద్దాం. ప్రాజెక్టులు నిర్మించాం. పెద్దపెద్ద ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశాం. భాజపా, దాని వెనక ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ కలిసి మేము నెలకొల్పిన వాటిని ఒకదాని తర్వాత మరొకదాన్ని అమ్మేస్తూ వస్తున్నారు. కొందరిని కుబేరులుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇవాళ రూపాయి విలువ 82.82కి పడిపోయింది. బియ్యం, పప్పులు, పెట్రోల్, డీజిల్.. ఇలా నిత్యావసర వస్తువుల ధరలు జీఎస్టీ కారణంగా ఆకాశాన్నంటు తున్నాయి. మా హయాంలో రూ.414గా ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ధర ఇవాళ రూ.1,100 అయింది. మహిళలకు ఉచితంగా ఇచ్చే పథకాలనూ లేకుండా చేశారు. ఇలాంటి పరిస్థితులు దేశంలో నెలకొన్నాయి. ఇలాంటి ధోరణులపై పోరాడేందుకే నేను నిలబడు తున్నాను.'-మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అధ్యక్ష అభ్యర్థి 'భాజపాకు ప్రజాస్వామ్యంపై నమ్మకమే లేదు. అద్వానీ, గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, నడ్డాలను ఎన్నికలు జరిపే ఎన్నుకున్నారా.? పైగా నడ్డా పదవీ కాలాన్ని పొడిగించారు. ముందు మీరు పాటించకుండా ఇతరుల గురించి మాట్లాడటమెందుకు? ప్రజాస్వామ్య విధానం కాకుండా ఏకఛత్రాధిపత్యంతో వ్యవహరించే భాజపాకు కాంగ్రెస్ అంతర్గత ఎన్నికల గురించి మాట్లాడే హక్కులేదు. ఏడీఎంకేగా ఉన్న పార్టీ ఏఐడీఎంకేగా మారింది. టీఎంసీగా ఉన్న పార్టీ ఆల్‌ఇండియా తృణమూల్ కాంగ్రెస్ అయింది. ఇలా అనేక ప్రాంతీయ పార్టీలు జాతీయ పార్టీలుగా పేరు మార్చుకున్నాయి. కానీ, కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా వాటిలో ఎవరూ చేరలేదు' అని మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. అంతకుముందు ప్రత్యేక విమానంలో బేగంపేట ఏయిర్‌పోర్టుకు చేరుకున్న ఖర్గేకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు రేవంత్, ఉత్తమ్, పొన్నం, వీహెచ్, పొన్నాల, సంపత్ స్వాగతం పలికారు. ఖర్గే వెంట ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కూడా హైదరాబాద్ వచ్చారు. అక్కడి నుంచి గాంధీ భవన్ చేరుకున్న ఖర్గే.. ఇందిరా భవన్‌లో పీసీసీ ప్రతినిధులతో సమావేశం అయ్యారు.

## సిరిసిల్ల జిల్లా నేత కార్మికుడి అద్భుత ప్రతిభ

(మొదటి పేజీ తరువాయి..) నల్ల విజయ్ వినూత్న ఆలోచనతో తయారు చేసిన 27 సుగంధ ద్రవ్యాలతో పరిమళించే పట్టు చీరను మంత్రులు కేటీఆర్, హరీష్ రావు ఆవిష్కరించారు. విజయ్ విజ్ఞప్తి మేరకు ఈ చీరకు సిరిచందన పట్టుగా మంత్రులు నామకరణం చేశారు. ఈ సందర్భంగా యువ చేనేత కళాకారుడు విజయ్‌ను మంత్రులిద్దరూ అభినందించారు. గతంలో మూడు కొంగుల చీర, ఉంగరంలో, దబ్బనంలో దూరే చీరలను, కుట్టు లేని లాల్చి, పైజామా, జాతీయ జెండాలను తయారు చేసి ప్రశంసలు అందుకున్నారు.

## మనుగోడు ప్రజల నమ్మకాన్ని అమ్ముకున్న రాజగోపాల్

(మొదటి పేజీ తరువాయి..) వ్యాఖ్యానించారు. మూడు సీట్లు ఉన్న పార్టీలోకి వెళ్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందా అని ప్రశ్నించారు. మునుగోడును మరింతగా అభివృద్ధి చేసుకునేందుకు వచ్చే నెల మూడోతేదీన జరగనున్న ఉప ఎన్నికలో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి కోరారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి- సంక్షేమ కార్యక్రమాల పట్ల అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. మునుగోడు ఉప ఎన్నికలలో టీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ కార్యకర్తలు సమన్వయంతో పని చేసి, ప్రజల మద్దతు కూడగట్టాలని కోరారు.టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలాగా పనిచేయాలని కోరారు.

## కార్పోరేట్లకు వ్యతిరేకం కాదు..

(మొదటి పేజీ తరువాయి..)గాంధీ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించే సమయంలో అదానీ-అంబానీలను లక్ష్యంగా చేసుకుంటుండటం తెలిసిందే. అటువంటి సమయంలో రాజస్థాన్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లోట్ ఆ పారిశ్రామికవేత్తల్లో ఒకరైన గౌతమ్ అదానీని ప్రశంసించారు. దీంతో గెహ్లోట్‌ను చాలా మంది విమర్శించారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ శనివారం భారత్ జోడో యాత్ర సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆదానీపై గెహ్లోట్ ప్రశంసల గురించి స్పందించాలని ఓ విలేకరి కోరినపుడు రాహుల్ గాంధీ మాట్లాడుతూ, తాను కార్పొరేట్లకు వ్యతిరేకం కాదని, కేవలం గుత్తాధిపత్యానికి మాత్రమే వ్యతిరేకమని చెప్పారు. అదానీ రాజస్థాన్‌లో రూ.60,000 కోట్లు పెట్టుబడులు పెడతానని చెప్పారన్నారు. ఇలాంటి ఆఫర్‌ను ఏ ముఖ్యమంత్రి అయినా తిరస్కరించజాలరని తెలిపారు. నిజానికి ఇలాంటి ఆఫర్‌ను తిరస్కరించడం ఏ ముఖ్యమంత్రికీ సరైనది కాదన్నారు. విలేకరి ఈ ప్రశ్న వేసినపుడు కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ వారించారు. కేవలం భారత్ జోడో యాత్ర గురించి మాత్రమే ప్రశ్నించాలని కోరారు. అయితే రాహుల్ గాంధీ స్పందిస్తూ, ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న కాబట్టి తాను ఈ ప్రశ్నకు ఇంగ్లిష్‌లో సమాధానం చెబుతానన్నారు. నిర్దిష్టంగా కొన్ని వ్యాపార సంస్థలకు సహాయపడటం కోసం రాజకీయ అధికారాన్ని ఉపయోగించడాన్నే తాను వ్యతిరేకిస్తానని చెప్పారు. రెండు లేదా మూడు లేదా నాలుగు పెద్ద వ్యాపార సంస్థలు దేశంలోని ప్రతి వ్యాపారంపైనా గుత్తాధిపత్యం సాధించడానికి రాజకీయంగా సహాయపడటానికే తాను వ్యతిరేకమని చెప్పారు. కార్పొరేట్లు, వ్యాపార సంస్థలకు తాను ఏ విధంగానూ వ్యతిరేకం కాదని, అయితే వ్యాపారాలపై గుత్తాధిపత్యం సాధించడానికే తాను వ్యతిరేకమని, కొన్ని సంస్థలు గుత్తాధిపత్యం సాధిస్తే, దేశం బలహీనపడుతుందని చెప్పారు. ÷ాజస్థాన్‌లో అదానీ గ్రూప్‌నకు సహాయపడేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ అధికారాన్ని ఉపయోగిం చలేదని, ఒకవేళ అలా చేసిననాడు తాను వ్యతిరేకిస్తానని చెప్పారు. ఆదానీ గ్రూప్ రాజస్థాన్‌లో రూ.65,000 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఏర్పాటు చేయబోతోందని ఆ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ తెలిపారు. దీనివల్ల 40,000 మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్ళ నుంచి ఏడేళ్ళలో 10,000 మెగా వాట్ల సౌర విద్యుదుత్పాదన కర్మాగారం, సిమెంట్ ఎ÷-లాంట్ విస్తరణ, జైపూర్ విమానాశ్రయం ఆధునికీకరణ వంటి ప్రాజెక్టులను చేపడతామన్నారు. ఈ వివరాలను 'ఇన్వెస్ట్ రాజస్థాన్, 2022' సదస్సులో ఈ నెల 7న ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్ గెహ్లోట్ మాట్లాడుతూ, అదానీని 'గౌతమ్ భాయ్' అని సంబోధించారు. ప్రపంచ కుబేరుల్లో రెండో స్థానాన్ని ఆక్రమించినందుకు అభినందించారు.

### తిరుమలలో కొనసాగుతున్నరద్దీ

**తిరుమల, అక్టోబర్8 (సమ సమాజం):** తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది .పెరటాసి మాసం, మూడవ శనివారంతో పాటు వరుస సెలవులు రావడంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -2, నారాయణగిరి ఉద్యానవనాల్లోని అన్ని షెడ్‌లు భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్లు గోగర్భం డ్యామ్ వద్దకు చేరుకున్నాయి. తమిళనాడుకు చెందిన భక్తులు తిరుమల కు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో శ్రీవారి దర్శనానికి 48 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. కంపార్టుమెంట్లన్నీ నిండి గోగర్భం జలాశయం వరకు భక్తులు వేచిఉన్నారు. రాత్రి 10 గంటల తరువాత క్యూలైన్లోకి భక్తులు వెళ్లకుండా సిబ్బంది నిలిపివేశారు.

## తెలంగాణలో వ్యూహకర్త పికె గేమ్ ప్లాన్

(మొదటి పేజీ తరువాయి..) లేదన్నారు. బీజేపీ, టీఆర్ఎస్ మధ్య రాజకీయ వైరుధ్యమున్నట్లు నమ్మిస్తున్నారని పేర్కొన్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వేల కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. కేసీఆర్ ఓ ఆర్థిక ఉగ్రవాదని విమర్శించారు. కేసీఆర్ అవినీతిపై కేంద్రం ఎందుకు విచారణ చేయట్లేదు? అని ఆయన ప్రశ్నించారు. బీజేపీని బలపర్చేలా మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. బీజేపీ, టీఆర్ఎస్ మధ్య ఎలాంటి రాజకీయ వైరుధ్యాలు లేవన్నారు. కాంగ్రెస్‌ను బలహీన పర్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్ లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) గెలవడానికి ప్రశాంత్ కిషోర్ వ్యూహమే కారణమన్నారు. విపక్షాలను బలహీన పర్చే విధంగా మమతా బెనర్జీ గెలవడానికి బీజేపీకి ప్రతిపక్ష హోదా రావడానికి ఇద్దరి మధ్య చక్రం తిప్పింది పీకేనే అన్నారు. తెలంగాణలో కూడా కేసీఆర్, మోడీల మధ్య పీకే ఉండి నడిపిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో టీఆర్ఎస్ రద్దయితే పీడ విరగడవుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. నిన్న కేటీఆర్ వ్యాఖ్యలు కూడా మోడీకి అనుకూలంగానే ఉన్నాయని చెప్పారు. టీఆర్ఎస్, బీజేపీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందని.. విభేదాలు మాత్రం లేవన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకే రెండు పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. టీఆర్ఎస్ రద్దయ్యే వరకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు.

## తెరాసను భారాస చేయడం వెనుక కుట్ర

(మొదటి పేజీ తరువాయి..) విమర్శించారు. మునుగోడులో రాజగోపాల్ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఉప ఎన్నికకు భాజపా అభ్యర్థిగా రాజగోపాల్ రెడ్డిని పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. తెరాసను భారాస చేయడం వెనుక కుట్ర ఉందని ఓ స్వామీజీ చెప్పినట్లు వెల్లడించారు. కేసీఆర్ చాలా రోజుల నుంచి తాంత్రిక పూజలు చేస్తున్నారని స్వామీజీ అన్నారని తెలిపారు. తాంత్రిక పూజలు చేసి తాంత్రికుడి సూచనతో కేసీఆర్ పార్టీ మార్చారని వ్యాఖ్యానించారు. మూడు నెలలకొకసారి నల్లపిల్లితో కేసీఆర్ పూజలు.. ఫామ్‌హౌజ్‌లో క్షుద్రపూజలు చేసి ద్రవాలు కాళేశ్వరంలో కలిపారని.. మూడు నెలలకొకసారి నల్లపిల్లితో కేసీఆర్ పూజలు చేస్తారని సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. స్వప్రయోజనాల కోసం కేసీఆర్ క్షుద్రపూజలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేసీఆర్ తన ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. మలక్‌పేట నియోజక వర్గానికి చెందిన తెరాస నేత లింగాల హరిగౌడ్ తన అనుచరులతో కలిసి భాజపాలో చేరారు. వీరికి సంజయ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లిక్కర్‌స్కాంపై వచ్చిన ఆరోపణలపై కేసీఆర్ ఎందుకు నోరుమెదపటం లేదన్న బండి... ఇష్టానుసారంగా దోచుకుంటే ఈడీ చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. దేశంలో సచివాలయానికి వెళ్లని ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్... తాంత్రికుడి మాటలు విని కొత్త సచివాలయ భవనం నిర్మిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఫాంహౌజ్‌లో కేసీఆర్.. నల్ల పిల్లితో తాంత్రిక పూజలు చేయిస్తారన్నారు. కేసీఆర్ ఆలోచనలు మార్చుకుని పాలన కొనసాగించాలని బండి సంజయ్ సూచించారు.తెరాస, మజ్లీస్ కలిసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మజ్లీస్ పార్టీ చట్టాలను గౌరవించడం లేదు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాజగోపాల్‌రెడ్డి రాజీనామా చేశారు. మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుస్తారని బండి అన్నారు. దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మోహన్ భగవత్‌పై కేటీఆర్ చిల్లర వ్యాఖ్యలు చేశారని రాజ్యసభ సభ్యులు కె లక్ష్మణ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మజ్లీస్ వైపు చూసే సాహసం.. కేసీఆర్ కూడా చేయలేరని అన్నారు. రాష్ట్రంలో మజ్లీస్ నేతల ఆగడాలు ఎక్కువ య్యాయని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు.

## చిరుతపులి సంచారంతో కలకలం

**పెద్దపల్లి, అక్టోబర్8 (సమ సమాజం):** పెద్దపల్లి జిల్లాలో చిరుతపులి సంచారం కలకలం రేపుతోంది. అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో చిరుతపులి సంచారాన్ని గ్రామస్థులు గుర్తించారు. దీంతో గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చిరుత సంచరిస్తుండంతో గ్రామస్థులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. రంగంలోకి దిగిన అధికారులు..చిరుత తిరుగుతున్న పరిసరాల్లో అడుగులను గుర్తించారు. గ్రామస్థులను అధికారులు అప్రమత్తం చేశారు.

## తెలంగాణను అప్పులకుప్పగా మార్చారు

(మొదటి పేజీ తరువాయి..)అయ్యారు. ప్రత్యేక తెలంగాణ సెంటిమెంట్‌తో ఆవిర్భవించిన టీఆర్ఎస్ తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. రూ.3 లక్షల కోట్లకు పైగా అప్పు చేసి ప్రజలపై భారం మోపిందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేక పోయారని ఆక్షేపించారు. నియామకాలన్న కేసీఆర్ రాష్ట్రంలో ఎందుకు ఉద్యోగాలు భర్తీ చేయట్లేదని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియామకాలు కల్పించడం లో టీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని నిర్మలా సీతారామన్ ్గ÷ర్ అయ్యారు. తెలంగాణనే మర్చిపోతున్న టీఆర్ఎస్ దేశానికి ఏం చేస్తుందని ప్రశ్నించారు. 2014 నుంచి 2018 వరకు మహిళలకు రాష్ట్ర కేబినెట్ లో చోటు ఇవ్వలేదు. రెండో సారి అధికారంలోకి వచ్చాక కూడా ఇవ్వలేదు. ప్రతిపక్షాల డిమాండ్ తో మహిళలకు మంత్రి వర్గంలో చోటు దక్కింది. ధనిక రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చారు. మహిళలను మంత్రివర్గంలో పెట్టుకుంటే మంచిది కాదని తాంత్రికుడు చెప్పడంతో మహిళలకు అవకాశం కల్పించలేదు. మంత్రాలు, తంత్రాలకు భయపడి కేసీఆర్ సచివాలయానికి వెళ్లలేదని నిర్మలా సీతారామన్ అన్నారు.

## 3వేల మంది అగ్నివీరులకు వాయుసేన శిక్షణ

### అగ్నిపథ్ కింద రిక్రూట్ చేయడం పెద్ద సవాలే
### చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరీ

**చండీఘడ్, అక్టోబర్8 (సమ సమాజం):** భారత వైమానిక దళం 90వ వార్సికోత్సవాన్ని జరుపుకుంటోంది. ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వివేక్ రామ్ చౌదరీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది చరిత్రాత్మకమైన సందర్భమని, వైమానిక దళంలో ఆఫీసర్ల రిక్రూట్మెంట్ కోసం వెపన్ సిస్టమ్ బ్రాంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఐఏఎఫ్ చీఫ్ వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఐఏఎఫ్‌లో ఆపరేషన్ బ్రాంచ్‌ను క్రియేట్ చేయడం ఇదే తొలిసారి అని ఆయన అన్నారు. వెపన్ సిస్టమ్ శాఖ వల్ల ఫ్లయింగ్ శిక్షణ కోసం అయ్యే ఖర్చుల్లో సుమారు 3400 కోట్లను ఆదా చేయవచ్చు అని చౌదరీ తెలిపారు. అగ్నిపథ్ స్కీమ్ ద్వారా వైమానిక దళంలోకి ఎయిర్ వారియర్లను రిక్రూట్ చేయడం ఓ పెద్ద సవాల్ అన్నారు. కానీ దేశంలోని యువత సామర్థ్యాన్ని గుర్తించి, వాళ్లను దేశ సేవ కోసం వినియోగించుకోవాలన్నారు. అగ్నివీరుల శిక్షణ విధానాన్ని మార్చామని, ఐఏఎఫ్‌లో కెరీర్‌ను కొనసాగించేందుకు తగిన రీతిలో వారిని సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్‌లో 3వేల మంది అగ్నివీరులకు వాయుసేన కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సంఖ్యను మునుముందు పెంచనున్నట్లు ఆయన వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి మహిళా అగ్నివీరుల్ని రిక్రూట్ చేసేందుకు ఎ÷-లాన్ వేస్తున్నట్లు ఐఏఎఫ్ చీఫ్ తెలిపారు. దీని కోసం మౌళిక సదుపాయాల కల్పనలో నిమగ్నమైనట్లు ఆయన వెల్లడించారు. 90వ వార్షికోత్సవం సందర్భంగా భారత వైమానిక దళం ఇవాళ తమ దళం కోసం కొత్త యూనిఫామ్‌ను ఆవిష్కరించింది. ఛండీగఢ్‌లో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. భారతీయ వైమానిక దళం 90వ వార్షిక దినోత్సవంలో ఎయిర్ షోలు, పరేడ్‌లు ఆకట్టుకున్నాయి. దాదాపు 80 విమానాలతో నిర్వహించిన ఎయిర్ షోను అదుర్స్ అనిపించింది. మరోవైపు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ డే సందర్భంగా ఎయిర్ స్టాఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి కొత్త యూనిఫామ్‌ను ఆవిష్కరించారు. అంతేకాకుండా ఎంఈలోని అధికారుల కోసం వెపన్ సిస్టమ్ బ్రాంచ్‌ను రూపొందించడానికి కేంద్రం ఆమోదం తెలిపిందని వీఆర్ చౌదరి ప్రకటించారు. ఒడీగఢ్‌లోని వైమానిక దళ స్టేషన్‌లో భారత వైమానిక దళం చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మార్చ్-పాస్ట్..రైఫిల్స్‌తో డ్రిల్ తో వైమానిక దళ సిబ్బంది ఆశ్చర్యపరిచారు.


## అధర్మం ఎప్పుడూ అపజయాన్నే ఇస్తుంది ! (ఆధ్యాత్మిక చింతన )

**తిరుమ, అక్టోబర్8 (సమ సమాజం):** కర్ణుడు ఎంత బలశాలి అయినా..ఎంతటి దానగుణ శీలుడు అయినా అధర్మంగా వ్యవహరించడంతో యుద్ధంలో మరణించక తప్పలేదు. అతను ఎన్ని మంచి పనులు చేసినా ధర్మం తప్పాడు కనుక యుద్ధ సమయంలో అస్త్రశస్త్రాలు పనిచేయయకపోగా, శాపాల వల్ల కుంగిపోవాల్సి వచ్చింది. మనం కూడా గుళ్లూగోపురాలు తిరుగుతూ..దానధర్మాలు చేస్తున్నామని భావిస్తున్నా..అధర్మంగా ఉంటే జీవితంలో కష్టాలు తప్పవు. కర్ణుడు, అర్జునుడు... వీరిద్దరూ కుంతీదేవి కుమారులే. కానీ ప్రత్యర్థులుగా వేర్వేరు పక్షాల తరపున పోరాడారు. కర్ణుడు శాపగ్రస్తుడు. ఆ శాపాల కారణంగా... అర్జునుడితో కీలకమైన యుద్ధం చేస్తున్న సమయంలో... అతనికి ఉన్న పోరాట కౌశలం, అనుభవం అతణ్ణి కాపాడలేకపోయాయి. యుద్ధంలో ఓడిపోయాడు, మరణించాడు. ఈ పరిస్థితి మనందరికీ వర్తిస్తుంది. ఎందుకంటే మనందరం కర్ణుడిలాంటి వాళ్ళమే. జీవితంలో మనం ఎన్నో నేర్చుకుంటాం, విజ్ఞానాన్నీ, అనుభవాన్నీ సంపాదిస్తాం. కానీ కీలకమైన సందర్భాల్లో... మన సహజ ప్రవృత్తికి అనుగుణంగా ఆలోచించి, వ్యవహరిస్తాం కానీ, మన అవగాహనకు లేదా జ్ఞానానికి అనుగుణంగా కాదు. ఎందుకంటే, మన జ్ఞానం లోతు... మనకు అవసరమైన స్థాయి కన్నా తక్కువగా ఉంటుంది. దీన్ని సూచిస్తూ... 'భగవద్గీత'లో అనేక కోణాల్లో శ్రీకృష్ణుడు పదేపదే వివరించాడు. మనలో అంతరాత్మ, బహిరాత్మ ఉంటాయనీ, అవి ఒకే నదికి రెండు తీరాల్లాంటివనీ భగవద్గీత చెబుతోంది. భౌతికమైన శరీరం, మన భావోద్వేగాలు, ఆలోచనలు, మన చుట్టూ ఉన్న ప్రపంచంతో కూడిన బహిరాత్మతో నేనని సాధారణంగా భావిస్తూ ఉంటాం. అయితే, సత్యాన్ని గ్రహించి... అన్ని జీవులలోనూ ఉన్నది, శాశ్వతమైనదీ, ఎలాంటి మార్పూ లేనిదీ అయిన అంతరాత్మను నేనేనని తెలుసుకోవాలని శ్రీకృష్ణుడు జ్ఞానోదయం చేస్తాడు.




# చలన చిత్రం





## ఆదిపురుష్ విడుదల కాకుండా పిటిషన్

ఆదిపురుష్ సినిమాను కష్టాలు వెన్నాడుతున్నాయి. ఇప్పటికే రావణ, హనుమాన్ పాత్రలపై దుమారం రేగగా, తాజాగా చిత్రం విడుదలపై స్టే విధించాలని కోరుతూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. 'ఆదిపురుష్' సినిమా విడుదలపై స్టే విధించాలని కోరుతూ ఢిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. రాముడు, హనుమంతుడిని తోలు పట్టీలు ధరించి అసమంజసమైన ధోరణిలో చూపించారని పిటిషన్‌లో ఆరోపించారు. రావణుడ్ని కూడా తప్పగా చూపించారని కూడా పేర్కొన్నారు. దీనిని నిషేధించాలని ఇప్పటికే పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కోర్టులో పిటిషన్ దాఖలు కావడం కొత్త తలనొప్పులకు దారితీయవచ్చు. అయితే ఇక్కడ మాత్రం ప్రేక్షకుల అంచనాలను 'ఆదిపురుష్' టీజర్ అందుకోలేకపోవడం.. సినిమాలోని పాత్రలను తప్పగా చూపించారనే కారణాలే ప్రస్తుతం జరుగుతున్న ట్రోలింగ్‌కు దారితీస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.



## గుణశేఖర్ ఇంట పెళ్లి బాజా

ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ ఇంట శుభకార్యం జరిగింది. దర్శకుడు గుణశేఖర్ కుమార్తె.. నిర్మాత నీలిమ ఏడడుగుల బంధంలోకి అడుగుపెట్టనున్నారు. హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రవి ప్రక్యాతో ఆమె నిశ్చితార్థం వేడుకగా జరిగింది. ఈ వేడుకకు కుటుంబసభ్యులు, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఆయన కుమార్తె నీలిమ ఏడడుగుల బంధంలోకి అడుగుపెట్టనున్నారు. హైదరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రవి ప్రక్యాతో నీలిమ నిశ్చితార్థం వేడుకగా జరిగింది. ఈ వేడుకకు కుటుంబసభ్యులు, సినీ ప్రముఖులు హాజరయ్యారు.÷ాబోయే భర్తను పరిచయం చేస్తూ నీలిమ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. 'నా జీవితకాల ప్రయాణం మొదలైంది' అని పేర్కొన్నారు. దీంతో ఆమెకు నెటిజన్లు అభినందనలు తెలుపుతున్నారు. సినిమాలపై ఉన్న ఆసక్తితో తండ్రిబాటలోనే అడుగులు వేసిన నీలిమ నిర్మాతగా మారారు. గుణశేఖర్ తెరకెక్కించిన 'రుద్రమ దేవి'కి సహ నిర్మాతగా వ్యవహరించిన నీలిమ.. ఇప్పుడు 'శాకుంతలం' చిత్రానికి నిర్మాతగా చేస్తున్నారు.

## ఓటిటిలోనూ దూసుకెల్తున్న కార్తికేయ 2 మంచిరేటింగ్స్ వస్తున్నట్లు ప్రకటన




బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ గా నిలిచిన చిత్రాల్లో కార్తికేయ 2 ఓటిటిలోనూ దుమ్మురేపుతోంది. నిఖిల్ సిద్దార్థ్ – మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన ఈ మిస్టికల్ అడ్వెంచర్ థ్రిల్లర్ కు చందూ మొండేటి దర్శకత్వం వహించారు. 'కార్తికేయ 2' చిత్రాన్ని ఆగష్టు 13న తెలుగుతో పాటు హిందీ తమిళ భాషల్లో థియేటర్లలో విడుదల చేసారు. ఆ తర్వాత మలయాళంలోనూ రిలీజ్ చేశారు. అన్ని భాషల్లోనూ అనూహ్య స్పందన తెచ్చుకొని ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భీభత్సమైన ప్రాఫిట్స్ రాబట్టింది. ముఖ్యంగా బాలీవుడ్‌లో ఎలాంటి అంచనాలు లేకుండా చిన్న సినిమాగా వచ్చి భారీ వసూళ్లను అందుకుంది. కృష్ణతత్వం.. దాని చుట్టూ అల్లుకున్న మిస్టరీల నేపథ్యంలో రూపొందిన 'కార్తికేయ 2' చిత్రానికి తెలుగుతో పాటు బాలీవుడ్ ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారని చెప్పాలి. 'కార్తికేయ 2' సినిమా.. ప్రముఖ ఓటీటీ 'జీ5' వేదికగా డిజిటల్ రిలీజ్ కాబడింది. దసరా కానుకగా అక్టోబర్ 5వ తేదీ నుంచి తెలుగు తమిళం మరియు హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేశారు. థియేటర్లలో సత్తా చాటిన 'కార్తికేయ-2' చిత్రం.. ఇప్పుడు ఓటీటీలోనూ సంచలనం సృష్టిస్తోంది. కేవలం 48 గంటల్లో 100 కోట్లకు పైగా స్ట్రీమింగ్ మినిట్స్ అందుకొని డిజిటల్ స్పేస్ లో సరికొత్త రికార్డ్ ను క్రియేట్ చేసింది. ఈ విషయాన్ని జీ5 సంస్థ ట్విట్టర్ వేదికగా అధికారికంగా ప్రకటించింది. 'కార్తికేయ 2' సినిమా బాక్సాఫీస్ సక్సెస్ తో పాటు అగ్ర దర్శక హీరోలు – సెలబ్రిటీలు మరియు రాజకీయ నాయకుల నుండి విస్తృతమైన ప్రశంసలు అందుకుంది. థియేటర్స్ లో ప్రభంజనం చూపించడం కాకుండా ఇప్పుడు ఓటీటీలోనూ అదే స్థాయిలో ఆదరణ పొందడం విశేషం.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in